క్లుప్తంగా

'మనూ' ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ 31న

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐటీఐ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా అజీమ్ శనివారం తెలిపారు. మూడవదశ కౌన్సిలింగ్‌ను ఈనెల 31వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి ఐటీఐ భవనంలో నిర్వహిస్తామన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో పాల్గొనే వారు దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీగా ఈనెల 30వ తేదీగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు ఐటీ కార్యాలయంలో వ్యక్తిగతంగా కానీ లేదా ఫోన్ నంబర్ 040-23008428, సెల్‌ఫోన్ 9440692452లో సంప్రదించాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు


దరఖాస్తు ఇవ్వడానికి గాంధీభవన్‌కు వచ్చిన రఘునందన్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎం.రఘునందన్‌రెడ్డి శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మూడు దశాబ్దాల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటున్నానని, 2020 సంవత్సరంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమకుమార్‌రెడ్డి తనను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

సేవారత్న పురస్కారాలు ప్రదానం

మాదాపూర్: మాదాపూర్‌లోని స్వాతి హైస్కూల్‌లో శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్‌థెరిసా సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్య శ్రీపతి రాముడు పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి సేవాసంస్థలకు చెందిన పి.వి.జి.శర్మ, సుబ్బలక్ష్మీ దంపతులను, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎమ్.ఎ. బేగ్, ఎస్ఓఎస్ అనాథ శరణాలయానికి చెందిన వికాస్‌కు సేవారత్న పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో రాగం మల్లికార్జునయాదవ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఫణికుమార్, సభ్యులు విష్ణుప్రసాద్, కొండశ్రీను, జనార్దన్, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్వాలిజీల్ రెండో డెలివరీ కేంద్రం ప్రారంభం

మాదాపూర్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉపాధి కల్పన విషయంలో చాలా తేడా ఉందని భారత పరిశ్రమల సమాఖ్య చైర్మన్ సీ. శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఐల్యాబ్స్‌లో క్వాలిజీల్ రెండవ డెలివరీ కేంద్రాన్ని ఆయన శనివారం నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. క్వాలిజీల్ సీఈఓ ప్రదీప్ గోవిందస్వామి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు హైదరాబాద్‌లో తమ గ్లోబల్ డెలివరీ సెంటర్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నాయన్నారు.

30 తులాల ఆభరణాలు చోరీ

● మూడు గంటల్లో రికవరీ

గచ్చిబౌలి: రూ.40 లక్షల విలువైన డైమండ్, బంగారు ఆభరణాల చోరీ కేసును రాయదుర్గం పోలీసులు మూడు గంటల్లో ఛేదించారని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ మహేష్ తెలిపారు. మైహోం భూజ ఫ్లాట్ నంబర్ 1104లో నివాసం ఉండే స్వాతి తన నగలు మాయమయ్యాయని శనివారం ఉదయం 7 గంటలకు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించి పని మనిషి చోరీ చేసి ఉంటుందనే అంచనాకు వచ్చారు. శ్రావణ శుక్రవారం పూజలు ఉండటంతో నగలు బ్యాగ్‌లో ఉంచి కప్‌బోర్డులో పెట్టారు. దీనిని గమనించిన పని మనిషి రేణుక నగలు తీసుకొని వెళ్లిపోయింది. రాత్రి 11 గంటలకు చూడగా నగలు కనిపించలేదు. ఉదయం 7 గంటలకు ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాలు హుటాహుటిన కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీలో ఉండే రేణుకను అదుపులోకి తీసుకొని విచారించగా ఆభరణాలు చోరీ చేసినట్లు అంగీకరించింది.రూ.40 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్, బంగారు ఇయర్ రింగ్‌లు, నెక్లెస్, బ్రాస్ లెట్, నల్లపూసల తాడు, 2 లాకెట్లు మొత్తం 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

హరితహారంతో 7.79 శాతం పెరిగిన పచ్చదనం

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ


మాతృశ్రీనగర్ కాలనీలో మొక్క నాటిన ఎమ్మెల్యే గాంధీ, డీసీ వంశీకృష్ణ, శేరిలింగంపల్లి బయోడైవర్సిటీ డిప్యూటి డైరెక్టర్ అనిల్ కుమార్ తదితరులు

హఫీజ్‌పేట్ : కోటి మొక్కల వృక్షార్చన తెలంగాణకు మణిహారమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ, శేరిలింగంపల్లి బయోడైవర్సిటీ డిప్యూటి డైరెక్టర్ అనిల్ కుమార్‌లతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి మొక్కల వృక్షార్చన, ఒక రోజు–ఒక కోటి మొక్కలు నాటే కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటామన్నారు. సీఎం కేసీఆర్ మానసపుత్రిక హరితహారం కార్యక్రమం అని అన్నారు. తొమ్మిది సంవత్సరాల హరితహారం కార్యక్రమంలో తెలంగాణలో 7.79 శాతం అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు.కార్యక్రమంలో అర్బన్ బయో డైవర్సిటి మేనేజర్లు సమీరా, యూసుఫ్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పి ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, దేవేందర్, హరి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

శేరిలింగంపల్లి: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి తారానగర్‌లో బీఆర్ఎస్ నాయకులు హబీబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్ పటేల్‌లతో కలసి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శేరిలింగంపల్లిలో ముస్లిం మైనార్టీలకు సకల హంగులతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జి.మోహన్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాజుయాదవ్, ప్రవీణ్, పద్మారావు, రాంబాబు, మహ్మద్ బేగ్, బాబు మియా, ఖాసీం, అష్రాఫ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరం


గచ్చిబౌలిలోని ఎస్కీలో ముగింపు సమావేశంలో అతిథులు, పలు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: మానవాళికి మంచి భవిష్యత్తును అందించేందుకు సమష్టి కృషి అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఈ–20 సమ్మిట్, అంతర్జాతీయ సదస్సును ' టువర్డ్స్ నెట్ జీరో ఇన్ ఇండస్ట్రియల్ ఆఫ్ జీ–20' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి వాతావరణం అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్మార్ట్ సిటీలతో సహ స్థిరమైన పట్టణాభివృద్ధి, చమురు, గ్యాస్, రసాయనాలు, సిమెంట్, ఇనుము, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీని ఏకీకృతం చేయడం, పారిశ్రామిక రంగం ఆవశ్యకతవంటి కీలక అంశాలపై దృష్టి సారించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ముగింపు వేడుకల్లో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం జగదీవార్, పద్మశ్రీ డాక్టర్ త్రిపురనేని చౌదరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, ఐఈఐ అధ్యక్షుడు శివానంద్‌రాయ్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్


మాతృశ్రీనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో బీజేపీ గడపగడపకు రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధిని చూడాలన్నారు. భూ కబ్జాలకు, కబ్జాదారులకు అండగా ఉంటున్న ఎమ్మెల్యేను ఇంట్లో కూర్చోబెట్టాలన్నారు. ఈ ప్రజాయాత్రలో నాయకులు రాధాకృష్ణ యాదవ్, మదనాచారి, శ్రీశైలం కురుమ, మధుయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్, సీతారామరాజు, వేణుగోపాల్, శ్రీశైలం, రంజిత్, ప్రవీణ్, సంతోష్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం లక్ష్యం


ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పీహెచ్‌సీ సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం.. రుద్రారం, భానూరు, లక్డారం గ్రామాలలో 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించి తలపెట్టిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టారని తెలిపారు. ఆధునిక వైద్య చికిత్స, ఖర్చుతో కూడుకున్న వైద్య పరీక్ష కేంద్రాలు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి పల్లెలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం హరితహారం కార్యక్రమం నిర్వహించడంతో పాటు లక్షల మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన హరితహారం కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటారు. లక్డారం గ్రామంలో 12 మంది లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి,ఎంపీడీఓ బన్సీలాల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, ఆయా గ్రామాల రుద్రారం సర్పంచులు సుధీర్ రెడ్డి, లక్డారం సువర్ణ మాణిక్‌రెడ్డి,, ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను సినీనటి అషురెడ్డి, కామాక్షి భాస్కర్ల శనివారం ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో పలువురు డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు డొమినిక్ తెలిపారు.

కనువిందు..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం చెన్నైకి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి అనఘా జీఎస్ తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో దేశ్ తిల్లాన, సరసాలాడే డెందుకు తదితర అంశాలను ప్రదర్శించింది. సాహితి అజ్జరపు శిష్య బృందం పుష్పాంజలి, మూషికవాహన, హరివరాసనం, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు సాహితి అజ్జరపు, నైషా, నాగవైష్ణవి, రేష్మీ మీనన్, ఆయూషి, తనిష్క తదితరులు ప్రదర్శించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఈఆర్ఓ రజనీకాంత్‌రెడ్డి


పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఈఆర్ఓ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పోలింగ్‌స్టేషన్ భవనాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డే ను నియోజకవర్గ ఈఆర్ఓ రజినీకాంత్‌రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గ పరిధిలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్ర భవనాల్లో ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్, ఫారం–6, ఫారం–8లను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడ డ్రాఫ్ట్ రోల్‌ను పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా తప్పులు ఉన్నా, నియోజకవర్గ పరిధిలో చిరునామా మార్పు కోసం కూడ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా అక్టోబర్ 1 తేదీ వరకు 18 ఏళ్ల వయస్సు వారు కూడా ఓటరు జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఫైనల్లో లోకేశ్, రుషేంద్ర

జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్

సాక్షి, హైదరాబాద్: కోటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్–2023 పురుషుల సింగిల్స్‌లో లోకేశ్ పరస, రుషేంద్ర తిరుపతి ఫైనల్లోకి ప్రవేశించారు. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో లోకేశ్ 2–19, 21–17 స్కోరుతో అనిశ్‌రాజ్ రాజ్‌కుమార్‌పై విజయం సాధించాడు. రెండో సెమీఫైనల్లో రుషేంద్ర 21–14, 22–20తో సుమేర్ షేక్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో నవ్య కండేరి, తాన్వి శర్మ ఫైనల్‌కు చేరుకున్నారు. తొలి సెమీస్‌లో నవ్య 21–13, 17–21, 21–13 స్కోరుతో సూర్య చరిష్మాపై గెలుపొందగా, మరో సెమీస్‌లో తాన్వి 22–20, 21–18తో అన్‌మోల్ ఖర్బ్‌పై విజయం సాధించింది. పురుషుల డబుల్స్‌లో అర్ష్ మొహమ్మద్–భరత్ సంజయ్, నికోలస్ రాజ్ – తుషార్ సువీర్ జోడీలు, మహిళల డబుల్స్‌లో నఫచనోక్–సబ్రీనా, కెట్‌క్లీంగ్–ఫనాచెట్ జంటలు ఫైనల్లోకి ప్రవేశించగా....మిక్స్‌డ్ డబుల్స్‌లో కనపురం సాత్విక్ రెడ్డి – వైష్ణవి ఖడ్కేకర్, భరత్ సంజయ్–రష్మిత దోనెపూడి తుది పోరుకు అర్హత సాధించారు.

సంగీత కచేరీ

మాదాపూర్: హైటెక్స్‌లో సహజ యోగా ట్రస్ట్ , తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం జర్నీ విత్ ఇన్ పేరిట సంగీత కచేరీ నిర్వహించారు. వాయిద్య కళాకారులు పండిత్ అవనీంద్ర శివాల్కర్ సితార్ కచేరీ, సహజ యోగా సూఫీ సంగీత విద్వాంసురాలు ప్రొఫెసర్ ఆనందిత బసు బృందం కవాలి కార్యక్రమాలను నిర్వహించారు.

తిరుగులేని శక్తిగా బీజేపీ

● మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్


పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: భారతీయ జనతా పార్టీని శేరిలింగంపల్లిలో తిరుగులేని శక్తిగా మార్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బీజేపీ సీనియర్ నాయకులు ఎం.బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. మదీనాగూడ, మసీద్‌బండలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పలువురికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని బీజేపీకి అవకాశం ఇస్తే ప్రజారంజక పాలన అందిస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, ప్రధాని నరేంద్ర మోది, అమిత్ షా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీజేపీలో పలువురు చేరుతున్నారని తెలిపారు. రాఘవేంద్రరావు, వినోద్‌రావు, నాగులుగౌడ్, కార్పొరేటర్ బొబ్బా నవతారెడ్డి, రాధాకృష్ణ యాదవ్, రాములు, జగదీష్, లక్ష్మణ్, చంద్రమ్మ, యాదగిరి ముదిరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని ఫేజ్ 5లో భూ ఆక్రమణ జరుగుతుందని సెంట్రల్ కమిటీ అధ్యక్షులు నల్లా సంజీవరెడ్డి చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని 5వ ఫేజ్‌లో బిల్డర్ కట్టిన ప్రహరీ గోడ పడగొట్టి, పక్కనే ఉన్న స్థలంను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా అక్కడే నివసిస్తున్న 650 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సెంట్రల్ కమిటీ సభ్యులు నాగరాజు, రవికుమార్, మస్తాన్, చినబాబు, లక్ష్మణ్, సూర్య భగవాన్, రంజిత్‌రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

మారథాన్.. ట్రాఫిక్ ఆంక్షలు

గచ్చిబౌలి: హైదరాబాద్ మారథాన్–2023 నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్ తెలిపారు.

ఫుల్ మారథాన్

42 కెఎం ఫుల్ మారథాన్ పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమవుతుందని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 నుంచి కేబుల్ బ్రిడ్జి, ఐటీసీ కోహినూర్, మై హోం అబ్రా సీ గేట్, ఐకియా, ఎన్‌సీబీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, ట్రిపుల్ ఐటీ జంక్షన్ ,హెచ్‌సీయు, మసీద్‌బండ గేట్, తిరిగి గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంటుంది.

హాఫ్ మారథాన్

21 కెఎం హాఫ్ మారథాన్ పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమై కేబుల్ బ్రిడ్జి, ఐటీసీ కోహినూర్, మై హోం అబ్రా సీ గేట్, ఐకియా, ఎన్‌సీబీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లై ఓవర్, ట్రిపుల్ ఐటీ జంక్షన్ గచ్చిబౌలి స్టేడియం వరకు కొనసాగుతుంది.

10 కె రన్

10 కె రన్ హైటెక్స్ నుంచి మెటల్ చార్మినార్, సీఐఐ జంక్షన్, టెక్ మహీంద్ర, డెల్ జంక్షన్, లెమన్ ట్రీ హోటల్, ఐకియా అండర్ బ్రిడ్జి, ఎన్‌సీబీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లై ఓవర్, ట్రిపుల్ ఐటీ, గచ్చిబౌలి స్టేడియం వరకు ఉంటుంది.

రోడ్లు మూసివేత

◆ తెల్లవారు జామున 4.30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మై హోం అబ్రా సీగేట్, ఐటీసీఎల్ లేన్, స్కైవ్యూ లేన్, హై హోం భూజ, ఎన్‌సీబీ జంక్షన్ నుంచి స్టేడియం వరకు ఎడమ వైపు అన్ని యూటర్న్‌లు మూసివేస్తారు.

ప్రత్యామ్నాయ మార్గాలు

జూబ్లీహిల్స్ నుంచి వచ్చే వాహనాలు కావూరీహిల్స్, సీఓడీ జంక్షన్, దుర్గం చెరువు, ఐటీసీ కోహినూర్ ఎడమ వైపు తిరిగి టీ హబ్, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి ఓఆర్ఆర్‌కు చేరుకోవచ్చు.

◆ కొత్తగూడ నుంచి మెటల్ చార్మినార్ వైపు వాహనదారులు రోలింగ్‌హిల్స్, రాంకీ టవర్స్, ఐకియా ఫ్లై ఓవర్,ఇనార్బిట్ మాల్, సీవోడీ జంక్షన్, సైబర్ టవర్స్‌కు చేరుకోవచ్చు.

◆ కొండాపూర్‌నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే వాహనాలు గచ్చిబౌలి జంక్షన్, సీపీఆర్ క్వార్టర్స్, పుల్లెల గోపీచంద్ అకాడమీ, విప్రో జంక్షన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.

◆ మెహిదీపట్నం, ఓఆర్ఆర్ నుంచి వచ్చే వాహనాలు గచ్చిబౌలి జంక్షన్, రాడిసన్ హోటల్, బొటానికల్ గార్డెన్, హెచ్‌సీయూ డిపో ,లింగంపల్లి వైపు..

◆ క్యూ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి వాహనాలు నానక్‌రాంగూడ రోటరీలో ఎడమ వైపు తిరిగి ఓఆర్ఆర్‌లో కలవాల్సి ఉంటుంది.

◆ లింగంపల్లి, హెచ్‌సీయూ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను డీఎల్ఎఫ్ నుంచి రాడిసన్ హోటల్, ఉడిపి హోటల్ వద్ద ఎడమ వైపు తిరగి గచ్చిబౌలి జంక్షన్‌కు చేరుకోవచ్చు.

◆ కూకట్‌పల్లి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనదారులు సైబర్‌టవర్ జంక్షన్ కొత్తగూడ జంక్షన్, గచ్చిబౌలి జంక్షన్ నుంచి ఓఆర్ఆర్‌కు వెళ్లవచ్చు.

ఎడ్యుకేషన్ కిట్స్ అందజేత

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం గణపతి గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ పిన్ ఇండియా సహకారంతో అడ్వాన్స్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పోచారం గ్రామ సర్పంచ్ జగన్ ,గ్రామ కార్యదర్శి సంగీత పార్కర్ కోఆర్డినేటర్ ఆఫీస్, మెడ్వాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. నృత్యంజలి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు టి.వి శిరీష శిష్యబృందం కూచిపూడి నృత్యాలతో అలరించారు. కళాకారులు నివేదిత తోలేటి, మైలవరపు శిరీష, ఆడిదం హాసిని, బండారు రెహతిక, బేబీ ఐక్య భరద్వాజ్, రాధిక బలేమర్థిలు నృత్యప్రదర్శన ఇచ్చారు. అమెరికా వాస్తవ్యులు ఆనంద వల్లీ నల్లపాటి జతిస్వరం అనే కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకుంది. అనంతరం సయంతని సేన్, కృతిజోషి చేసిన ఒడిస్సీ నృత్యాలు సందర్శకులను అలరించాయి.

చిన్నారుల కోసం 'లెగో నింజా' పోటీలు...

సాక్షి, సిటీబ్యూరో: వైవిధ్యభరితమైన, వినోదభరిత పోటీలకు పేరొందిన లెగో నింజా పోటీలను మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో నిర్వహిస్తున్నారు. మొత్తం 4 దశల్లో సాగే ఈ పోటీలలో 5 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసు కలిగిన చిన్నారులు పాల్గొనవచ్చుని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన చిన్నారులకు బహుమతులతో పాటు ప్రత్యేకంగా ఫొటోబూత్ ఏర్పాటు చేశామన్నారు.

కొరియర్ బాక్సుల్లో గంజాయి సరఫరా

● 90 కిలోల గంజాయి స్వాధీనం
● ఒడిశా టు చందానగర్ టు పూణె


వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

గచ్చిబౌలి: డీటీడీసీ కొరియర్ బాక్సుల్లో 90 కిలోల డ్రై గంజాయిని ఒడిశా నుంచి చందానగర్ వరకు తరలించి అక్కడి నుంచి స్విఫ్ట్ డిజైర్ కారులో పూణెకు తరలిస్తుండగా ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. రాయ్‌కోడ, సంగారెడ్డికి చెందిన నదారి లింగం(25), గుర్జువాడ, కోహీర్, సంగారెడ్డి జిల్లాకు చెందిన సున్నపు రాజు(29)లు లింగంపల్లిలోని గుల్‌మొహర్‌కాలనీ సిగ్నల్ వద్ద స్విఫ్ట్ కారులో ఉండగా పోలీసులు అరెస్ట్ చేశారు. కారులో ఉన్న 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిషాకు చెందిన చంద్రశేఖర్, మరో డీటీడీసీ ఉద్యోగి గంజాయిని ప్యాకెట్లుగా చేసి డీటీడీసీ కొరియర్‌లో చందానగర్‌కు పంపించారు. చందానగర్‌లోని డీటీడీసీ కొరియర్ ఆఫీస్ నుంచి గంజాయి పార్సిళ్లను సున్నపు రాజు తీసుకున్నాడు. స్విఫ్ డిజైర్ కారులో పూణెకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో గుల్‌మొహర్ కాలనీలో నిందితులు లింగం, రాజులను అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు మార్గంలో వస్తే చెక్ పోస్టులలో పట్టుబడే అవకాశం ఉందని డీటీడీసీ కొరియర్‌ను ఎంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. గంజాయిని పూణెలో సునీల్ అనే వ్యక్తికి అప్పగించాల్సి ఉంది. నిందితుడు నదారి లింగంపై బాలానగర్, పటాన్‌చెరు, రాయ్‌కోడ్ పీఎస్‌లలో ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. 2022లో పీడీ యాక్ట్‌పై లింగం జైలుకు వెళ్లాడు. ఏ2 సున్నపు రాజుపై 2021లో పశ్చిమగోదావరి జిల్లా కిర్లింపుడి పీఎస్‌లోఎన్‌డీపీఎస్ కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి గంజాయి ప్యాకెట్లతో పాటు 4 సెల్ ఫోన్లు, స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరా చేసినట్లు లేదా వాడినట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఏడీసీపీ సూచించారు. ఏసీపీ నర్సింహారావు, చందానగర్ సీఐ పాలవెల్లి పాల్గొన్నారు.